ప్రజాశక్తి



బుధవారం 20 డిసెంబర్ 2023 5 కర్నూలు



ఎ.నాగలాపురంలో శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ

ఒంటి కాలుపై నిలబడి

అంగన్వాడీల నిరసన...

- 8వ రోజు కొనసాగిన సమ్మెకు సిఐటియు, ఎఐటియుసి, కెవిపిఎస్ సంఘీభావం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 8వ రోజు సమ్మెలో భాగంగా కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. కృష్ణదేవరాయ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు అంగన్‌వాడీలు ప్రదర్శనగా వెళ్లి కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు ఒకకాలిపై నిలబడి నిరసన తెలిపారు. కార్యక్రమానికి సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షత వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, శ్రామిక మహిళా కన్వీనర్ పి.నిర్మల, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప, మాజీమంత్రిమూలింటి మారెప్ప, కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు నబిరసూల్, టిడిపి నగర నాయకులు పెరుగుపురుషోత్తం, కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎం.భాస్కర్, నగర అధ్యక్షులు జి.యేసు రాజు దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలనుద్దేశించి మాట్లాడారు. అంగన్వాడీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదని వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ అయినప్పుడు రూ.5 లక్షల ఇవ్వాలని, వేతనంతోకూడిన సెలవులు ఇవ్వాలని, విధులలో ఉండి అనారోగ్యంతో మరణిస్తే కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడి కేంద్రాలలో నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించడం కోసం నిధులుకేటాయించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేయాలన్నారు. అంగన్‌వాడీల ఆందోళనకు సంపూర్ణంగా మద్దతు తెలిపారు. ఎనిమిది రోజులు అవుతున్నా ప్రభుత్వంలో కొంచెం కూడా చలనం లేకుండా దున్నపోతు మీద వాన పడినచందంగా నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. 2019లో జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని, తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా జీతం ఇస్తానని చెప్పినటువంటి హామీని నిలబెట్టుకోవాలన్నారు. హామీలు అమలు చేయకుండా దౌర్జన్యంగా అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి సచివాలయ ఉద్యోగులతో అంగన్వాడి కేంద్రాలు



ఒంటి కాలుపై నిలబడి నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

నడుపుతామనే దుర్మార్గపు ఆలోచనను ఖండించారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే నాలుగు నెలల్లో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతారని హెచ్చరించారు. సిఐటియు నగర నాయకులు కె. సుధాకరప్ప, చిన్న వ్యాపారుల సంఘంనగర కార్యదర్శి ఎస్ఎండి రఫీ, ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్, కెవిపిఎస్ నగర నాయకులు రోశయ్య, సిఐటియు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులురేణుకమ్మ, బాలదుర్గమ్మ, సౌభాగ్యమ్మ, ఎఐటియుసి అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు చౌడేశ్వరి, రుక్మిణి, సరస్వతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-పత్తికొండ

అంగన్వాడి టీచర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని మంగళవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ముందు మొరపెట్టుకున్నారు. పత్తికొండలోని అంగన్వాడీ టీచర్లు ఆయాలు ప్రజా సంఘ నాయకులు కలుసుకొని సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే శ్రీదేవి ఇంటిని ముట్టడించారు. కంగాటి శ్రీదేవికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గోపాల్, అంగన్వాడి అండ్ హెల్పర్స్ యూనియన్ సంఘం నాయకులు కాంతమ్మ, శోభ, పద్మజ, రామలక్ష్మి, నీరజ, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి తాజ్ మహల్ పాల్గొన్నారు.



అంగన్వాడీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీదేవి

ఎ.నాగలాపురం గ్రామంలో

శ్మశానం ఏర్పాటు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఎ.నాగలాపురం గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జి.రామకృష్ణ కోరారు. మంగళవారం జి.రామకృష్ణతోపాటు సిపిఎం మండల కార్యదర్శి కె.మధు, మండల నాయకులు గోపి గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఉన్న శ్మశానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. గత ఎన్నో సంవత్సరాల నుంచి ఎ.నాగలాపురం గ్రామంలో శ్మశానం ఉందని తెలిపారు. శ్మశానం పక్కనే ఉన్న పెద్ద రైతు ఈ స్థలం 'నాదే' అంటూ కంచె వేయడం వల్ల గ్రామస్తులకు శ్మశాన సమస్య తీవ్రమైందని చెప్పారు. మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు కర్నూలు నగరానికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గ్రామస్తులంతా కొన్నేళ్లుగా అక్కడే శ్మశాన వాటికగా ఉపయోగించుకున్న స్థలంలోనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామస్తులకు శ్మశానానికి అవసరమైనంత భూమిని కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ నేటికీ గ్రామాల్లో శ్మశానాలు, తగిన సౌకర్యాలు లేకపోవడం ఆందోళనకరమైన విషయమని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతుందని విమర్శించారు. వందల, వేల ఎకరాల భూములు కబ్జా అవుతున్నాయని, కానీ గ్రామ అవసరాల కోసం రెండెకరాలు ఇవ్వలేకపోతున్న దుస్థితి ఉందని తెలిపారు. ఇదేం పరిపాలన అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, తదితర ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం వీరికి ప్రజల పట్ల ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థమవుతుందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇప్పుడున్న స్థలంలోనే ఎ.నాగలాపురం గ్రామానికి శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే ప్రజలందరినీ రాజకీయాలతో సంబంధం లేకుండా ఐక్యం చేసి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పెద్దపాడు గోపి, గ్రామస్తులు కృష్ణ పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలివ్వాలి

- సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజగోపాల్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు రాజగోపాల్ డిమాండ్ చేశారు. సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయి అధ్యక్షతన కర్నూలు నగర పాలక సంస్థ ముందు క్లాప్ డ్రైవర్లు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 ఇవ్వాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని భద్రత కల్పించాలని, ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కష్టపడి పని చేస్తున్న క్లాప్ డ్రైవర్లకు 6 నెలల నుంచి 13 నెలల వరకు జీతాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. పెండింగ్ జీతాలు పూర్తిగా ఇవ్వకపోవడంతో కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్నారని విమర్శించారు. రెడ్డి ఏజెన్సీ వారు పెండింగ్ జీతాలు ఇవ్వకపోగా, ప్రభుత్వంతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం డ్రైవర్లకు రూ18,500 ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పిఎఫ్, వీక్లీ ఆఫ్‌లు, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిని అమలు చేయకుండా రెండేళ్ల నుంచి క్లాప్ డ్రైవర్ల జీతంలో కోత విధిస్తున్నారని తెలిపారు. వారి అకౌంట్లో వేయడం లేదన్నారు. కార్మికులకు వీక్లీ ఆఫ్ ఇవ్వాలని ఉన్నా ప్రభుత్వ సంస్థల్లోనే అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యమిస్తున్న కార్మికులపై రెడ్డి ఏజెన్సీ వారు, మున్సిపల్ అధికారులు పని చేయాలని వేధిస్తున్నారని తెలిపారు. కార్మికుల కడుపులు కొట్టి వైసిపి ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పొట్ట నింపుకుంటున్నారని విమర్శించారు. క్లాప్ ఆటో కార్మికులకు జీతాలు ఇప్పించకుండా వారి కుటుంబాలను ఉపవాసం ఉంచడం వైసిపి ప్రభుత్వానికి, మున్సిపల్ అధికారులకు భావ్యం కాదని తెలిపారు. ఇప్పటికైనా వైసిపి ప్రభుత్వ పెద్దలు, మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకొని క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇప్పించాలని కోరారు.



నగర పాలక సంస్థ కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న నాయకులు

26న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల నిర్వహణ

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 26న ఆడుదాం ఆంధ్ర క్రీడల నిర్వహణ ప్రారంభం కానున్నందున, పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై మండల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... క్రీడల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లేయర్ రిజిస్ట్రేషన్ దాదాపు పూర్తయిందని, ఇక టీమ్స్ ఏర్పాటు, గ్రౌండ్స్ గుర్తింపు పైదృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో ఐదు క్రీడలను కచ్చితంగా నిర్వహించాలన్నారు. అందుకనుగుణంగా గ్రౌండ్స్‌ను గుర్తించి ఆడడానికి వీలుగా ఉండేలా వాటిని సిద్ధం చేయాలన్నారు. ఆయా క్రీడలకు సంబంధించిన క్రీడాకారులతో టీములు ఏర్పాటు చేయాలన్నారు. ఏ సచివాలయం, ఏ గ్రౌండ్‌లో, ఏటీమ్ ఆడతారు అన్న వివరాలతో షెడ్యూల్‌ను రూపొందించుకోవాలని ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన కిట్స్‌పూర్తి స్థాయిలో చేరాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. తాగునీటితో పాటు క్రీడాకారులకు తప్పనిసరిగా భోజన సదుపాయం కల్పించాలన్నారు. ఇందుకోసం నేడో, రేపో నిధులు విడుదల కానున్నాయని తెలిపారు. ఆయా క్రీడలకు రెఫరీలుగా వ్యవహరిస్తున్న వారు క్రీడలకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తిగా స్పష్టత కలిగి ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్,జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డిఎస్‌డిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

23 నాటికి అసైన్‌మెంట్ నివేదిక పంపాలి

ఈనెల 23 నాటికి అసైన్‌మెంట్ భూముల క్రమబద్ధీకరణ నివేదిక పంపాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత డివిజనల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఆడుదాం ఆంధ్ర' ఏర్పాట్లపై కలెక్టర్ మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 672 సచివాలయాల్లో ఈనెల 26న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు జరగాలని తెలిపారు. ప్లేయర్ రిజిస్ట్రేషన్‌లో వెనుకబడిన మండలాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రౌండ్స్‌ను త్వరగా గుర్తించాలన్నారు. కౌతాళం మండలం అన్ని అంశాల్లోనూ వెనుకబడి ఉంటోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపిడిఒపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి నియోజకవర్గ స్థాయి స్పెషల్ ఆఫీసర్లు ఫామ్స్ డిస్పోజల్‌పై రాండమ్‌గా తనిఖీలు చేశారన్నారు. ఈనెల 22, 23న కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నందున ఈ నెల 21లోపు ఫామ్స్ డిస్పోజల్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. జెండర్ రేషియో, 80 సంవత్సరాలులు పైబడిన వారు, పిడబ్ల్యుడి ఓటర్లకు సంబంధించి కూడా నివేదిక ఇవ్వాలని తెలిపారు. జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ... రీసర్వేకు సంబంధించి ఈనెల 31 నాటికి ఫైనల్ ఆర్ఒఆర్ పబ్లిష్ చేసేందుకు వీలుగా మండల, డివిజనల్ అధికారులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఫ్రీ హోల్డ్ అసైన్‌మెంట్‌కు సంబంధించి కూడా త్వరగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గౌస్‌దేశాయి, రాజశేఖర్ , విజయ్

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగరంలోని జోహరాపురం 18వ వార్డులో సుందరయ్యస్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా నాయకులు గౌస్ దేశాయ్, సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ జిల్లా కమిటీ సభ్యులు విజయ్ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గెలుపొందిన క్రీడాకారులు మరింత స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు.కరాటే మాస్టర్ సుధాకర్, స్థానిక నాయకులు రంగస్వామి, నాగరాజు , పాల్గొన్నారు.

న్యాయ రాజధానితోనే కర్నూలు అభివృద్ధి

- వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి నగరూరు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



న్యాయ రాజధానిని ఏర్పాటు చేయడం ద్వారానే కర్నూలు జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి నగరూరు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కర్నూలు నరసింహారెడ్డినగర్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాయలసీమ, అందులోనూ కర్నూలు జిల్లా తీవ్రంగా నష్టపోయిందన్నారు. విభజనకు ముందే వెనుకబడిన రాయలసీమ అనంతరం మరింత వెనుకబాటుకు గురైందన్నారు. ఆర్థిక వనరులన్నీ తెలంగాణకు వెళ్లిపోయాయన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నీ అమలుకు నోచుకోలేదన్నారు. చట్టంలో ఇచ్చిన హామీలు ప్రకారం ఏర్పాటు చేయాల్సిన జాతీయ విద్యా సంస్థలు, వైద్య సంస్థలు తిరిగి అమరావతిలో కేంద్రీకతమయ్యే విధానాన్ని గత ప్రభుత్వం అను సరించిం దన్నారు. తద్వారా విభజనకు ముందు జరిగిన తప్పులే మళ్ళీ పునరావృతమయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే వైసిపి ప్రభుత్వం అలాంటి తప్పిదం జరగ కూడదన్న ఆలోచనతో మూడు రాజధానుల ద్వారా అభివృద్ధి వికేంద్రీకరణకు పూనుకుందన్నారు. జిల్లాలో పరిశ్రమలు, ఇతర ఆర్థిక వనరులు లేకపోవడంవల్ల ఈ సమస్య తలెత్తుతుందన్నారు. దీనికి ప్రత్యామ్నయంగా కనీసం న్యాయ రాజధానిని ఏర్పాటు చేస్తే సమస్యను అధిగమించే అవకాశం ఉందన్నారు. అందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని అన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధికి కృషి : హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో 24వ వార్డ్ 61వ సచివాలయం పరిధిలో మద్దూర్ నగర్ వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు పూలదండలు, బొకేలతో వార్డు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగనన్నను మరొసారి ఆశీర్వదించాలని కోరారు. వీధిలో ఉన్న డ్రైనేజీ, మురుగు కాలువల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సనుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు చెప్పారు. వార్డ్ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అసిఫ్, డిష్‌రాజు, హనీస్‌ఖాన్, ఆల్బట్ అబ్బాస్‌అలీ, సుచరిత, సునీల్, అర్జున్, కిషోర్, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న హాఫీజ్‌ఖాన్

ఐకెపి అవినీతిపై విచారణ అవసరం

అధికారుల సహకారం తోనే అవినీతి-అధికారులపై ధ్వజమెత్తిన పొదుపు మహిళలు

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర ఐకెపి కార్యాలయంలో పొదుపు సంఘాల నిర్వహణలో జరిగిన అవినీతిపై విచారణ చేసి బాధ్యులు చర్యలు తీసుకోవాలని పొదుపు సంఘాల నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలు మాట్లాడుతూ అధికారుల వల్లే అవినీతి జరిగిందంటూ వాగ్వాదానికి దిగారు. మండల పరిధిలోని ఎడవల్లి గ్రామానికి సంబంధించి గ్రామ సంఘం ఎన్నిక కోసం కార్యాలయంలో మంగళవారం పొదుపు సంఘం లీడర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలు మాట్లాడుతూ 2008 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.10 లక్షలు దాకా అవినీతి జరిగిందని అన్నారు. అధికారుల సహకారంతోనే పొదుపు సంఘాల్లో అవినీతి చోటుచేసుకుందని అన్నారు. పొదుపు మహిళల పేరిట అక్రమంగా రుణాలు తీసుకొని కాజేశారని విమర్శించారు. పొదుపు సంఘాల్లో జరిగిన అవినీతిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొదుపు సంఘాల్లో జరిగిన అవినీతి తేల్చిన తర్వాతే గ్రామైక్య సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పొదుపు గ్రూపు నిర్వహణలో మహిళలకే ప్రాధాన్యం ఇవ్వాలని పురుషులను అనుమతించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం మధుబాబు, సిసిలు, కళావతి రామకృష్ణ పొదుపు సంఘాల లీడర్లు సభ్యులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న పొదుపు సంఘాల మహిళలు

మీ అధినేత చెల్లెలు ఏ పార్టీల్లో ఉన్నారో తెలుసుకోండి : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : తమ కుటుంబంపై ఇష్టానుసారంగా విమర్శలు చేసిన ఓ పెద్ద మనిషి ముందుగా మీ పార్టీ అధినేత, ఆయన చెల్లెలు ఏ పార్టీలో ఉన్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ అన్నారు. నగరంలోని జొహరాపురంలో టిడిపి నేత జేమ్స్ ఆధ్వర్యంలో వైసిపికి చెందిన యువకుడు ఆనంద్ ఆ పార్టీని వీడి తన మిత్రులతో కలిసి టిడిపిలో చేరారు.వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అక్కడ ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. టిజి.భరత్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం తమపై ఇష్టానుసారంగా మాట్లాడటం సరైంది కాదన్నారు. 2009 వరదల సమయంలో తాము కట్టుబట్టలతో ఇంటి నుండి బయటకు వచ్చినట్లు గుర్తు చేశారు. అప్పట్లో తమ తండ్రి టిజి వెంకటేష్ అధికారులతో కూర్చొని ఈ ప్రాంత ప్రజలను వరదల నుండి బయట పడేసేందుకు ఎంత కష్టపడ్డారో మీ కంటే కూడా అప్పుడు ఉన్న కార్పోరేటర్లకు, అధికారులకు బాగా తెలుసన్నారు. కరోనా సమయంలో కర్నూలుతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలకు నిత్యవసర సరుకులు అందించడమే కాకుండా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందించి, కర్నూలు ప్రజల కోసం కోట్లాది రూపాయలు విలువ చేసే హైపో ద్రావణాన్ని ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. తమపై విమర్శలు చేసే వాళ్లు ఆ పార్టీ అధినేత కుటుంబంలో ఉన్న పరిస్థితిని తెలుసుకొని మాట్లాడాలన్నారు. వచ్చేఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తానన్నారు.టిడిపిలో చేరిన వారిలో కమలాకర్, భరత్, సతీష్, శీను, రంగ, గిరి, భూపతి, రాము, రాజ్‌కుమార్‌లు ఉన్నారు.





ప్రిన్సిపల్ ప్రియదర్శినికి క్రీడాజ్యోతిని అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలి

కేంద్రీయ విద్యాలయం వార్షిక క్రీడా దినోత్సవంలో డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థులు గెలుపోటములను సమానంగా తీసుకుని జీవితంలో క్రీడాస్ఫూర్తితో మెలగాలని ప్రఖ్యాత గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. నంద్యాల చెక్‌పోస్టులోని కేంద్రీయవిద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన డాక్టర్ శంశర్ శర్మ వార్షిక క్రీడాజ్యోతిని వెలిగించి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ పాయల్ ప్రియదర్శికి అందించారు. అత్యంత క్రమశిక్షణతో నిర్వహించిన క్రీడలను ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా కోకో, కబడ్డీ, వాలీబాల్,బాస్కెట్‌బాల్, రన్నింగ్ రేస్ నిర్వహించారు. డాక్టర్ శంకర శర్మ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని క్రీడాస్ఫూర్తితో విద్యార్థులు ఇక్కడేకాదు నిజజీవితంలో కూడా మెలగాలని సూచించారు. క్రీడలు, యోగ , ధ్యానం, శారీరక, మానసిక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ వాటిని దినచర్యగా పాటించాలని తెలిపారు. విద్యార్థులకు పాఠశాలలో ఏదైనా సహాయ సహకారాన్ని అందించడానికి తను ఎల్లవేళలా అందుబాటులో సుముఖంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ పాయల్ ప్రియదర్శిని, వ్యాయామ ఉపాధ్యాయుడు బాదల్, స్పోర్ట్స్ కోచ్ వజ్రరాజు , ఉపాధ్యాయ బృందం పాల్గొని క్రీడా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు.

మధ్యాహ్న భోజన నిర్వహణలో రాజీవద్దు

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికేర మండల పరిధిలోని పెరవలి జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నిర్వహణలో రాజీ పడేది లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా అన్నారు. మంగళవారం ఆమె పాఠశాల ఆవరణంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నామని తెలిపారు. పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు కోడిగుడ్లు కూడా ఇస్తున్నామని అన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యాన్ని కూడా సంరక్షించుకునే అవసరముందని అన్నారు.ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, రంగస్వామి విద్యార్థులు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో గడపగడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం-2లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా చేశారని తెలిపారు. ప్రస్తుతం కిడ్నీ క్యాన్సర్ చికిత్సలకు ప్రజలు భయపడాల్సిన పని లేదన్నారు. సంక్షేమ పథకాల గురించి ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మారెమ్మ దేవాలయం వద్ద, బయట గేరి, బ్రాహ్మణ వీధుల్లో సిసి రోడ్లు వేయాలని ప్రజలు కోరారు. స్పందించి సచివాలయం నిధులతో రోడ్లను వేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సతీమణి జయమ్మ, వైసిపి మండల అధ్యక్షులు దేశాయి ప్రహ్లాద చారి, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, సర్పంచి పాల్ దినకరన్, ఉప సర్పంచి తిక్కయ్య, నాయకులు వెంకటరామిరెడ్డి, అవతారం, సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, ఉమాపతి, చౌదరి బసవరాజు, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్, భీమేష్, అనిల్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సిఎం లక్ష్యం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న జగన్మోహన్ రెడ్డి

సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని 21వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గడపగడపకు తిరిగి ఆయా ఇళ్లలో లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్ లెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైస్ ఛైర్మన్‌లు నజీర్ అహ్మద్, సునీల్ కుమార్, కౌన్సిలర్ నీలకంఠ, మురారి, రాజశేఖర్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరందించేందుకే ప్రాధాన్యత

- ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మల్లికార్జున

ప్రజాశక్తి - చిప్పగిరి


పంపింగ్ హౌస్‌లో నీటిని పరిశీలిస్తున్న డిఇ

ప్రజలకు జలాశయం నుంచి వచ్చే తాగునీరు కలుషితం కాకుండా పంపింగ్ హౌస్‌లో ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మల్లికార్జున తెలిపారు. జలాశయం నుంచి కలుషిత నీరు వస్తుందని గతవారం మండల కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు వివరించారు. మంగళవారం బెల్డోన జలాశయం నుంచి పంపింగ్ హౌస్ దగ్గర ఫిల్టర్ అవుతున్నాయా లేదా అని పరిశీలించారు. అలాగే బెల్డోన బస్టాండ్ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకులోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంపింగ్ హౌస్ దగ్గర ఉన్న మిషన్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉండాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మనోహర్‌కు సూచించారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ట్యాంకులు పాచి పట్టకుండా శుభ్రం చేయాలని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిప్పగిరి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మనోహర్ ఉన్నారు.

హనుమారెడ్డిని కలిసిన గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని


నాయకులతో మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

టిడిపి సీనియర్ నాయకులు, గొర్రెల సంఘం డైరెక్టర్ హనుమారెడ్డిని మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగుర వేసేందుకు సహకారం అందించాలని కోరారు. మాజీ ఎంపిపి మురళీ కృష్ణ, వడ్డేమాన్ గోపాల్, ముస్లిం, మైనార్టీ పట్టణ నాయకులు సాధిక్ వలీ, రాఘవేంద్ర రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, కురువ పరమేష్, వీరేష్ పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మల గోడు పట్టదా..?

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

- సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అక్కాచెల్లెమ్మల గోడు పట్టడం లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మండిపడ్డారు. అంగన్వాడీలంతా తన అక్కలు, చెల్లెమ్మలని ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో అభివర్ణించారని తెలిపారు. అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారని విమర్శించారు. మంగళవారం ఆదోనిలో అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకొని అంబేద్కర్ విగ్రహం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం అనేక దఫాలుగా వినతులు ఇచ్చినా స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లిన అక్క, చెల్లెమ్మల గోడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. అనంతరం ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.లలితమ్మ మాట్లాడారు. 'ఒక్క ఛాన్స్' ఇవ్వండి సమస్యలన్నీ పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోరారని, ఆయన మాటలను నమ్మి అధికారం కట్టబెడితే సమస్యలను విస్మరించడం తగదని విమర్శించారు. కొంతమంది ఎమ్మెల్యేలు, మంత్రుల ఇలాఖాల్లో అంగన్వాడీ కేంద్రాలను బలవంతంగా తెరిపించడం ఏమిటని మండిపడ్డారు. తాము చేస్తున్న ఈ పోరాటం ఇప్పటిది కాదని, వర్కర్‌కు రూ.175, హెల్పర్‌కు రూ.60 ఉన్న సమయం నుంచి తమకు జీతాలు చాలడం లేదని, పెంచాలని చేస్తున్న పోరాటమని తెలిపారు. **ఎమ్మిగనూరు** ప్రాజెక్టు పరిధిలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు జెఎసి కమిటీ ఆధ్వర్యంలో 8వ రోజు సమ్మె కొనసాగింది. అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించి, అక్కడే సామూహికంగా భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, ప్రాజెక్టు పట్టణ కార్యదర్శులు ఎస్.నాగలక్ష్మి, నాగశిరోమణి, బసమ్మ, నీరజ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి తాలూకా నాయకులు రంగన్న, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు ఎస్.రాజు మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా చర్చల పేరుతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ పెంచాలని కోరారు. సమ్మె విరమించాలని ప్రభుత్వం నుంచి బెదిరింపులు వస్తున్నాయని తెలిపారు. బెదిరింపులతో ఉద్యమాలు ఆగవని హెచ్చరించారు. ఎపి రైతుసంఘం జిల్లా, తాలూకా నాయకులు హనుమంతు, లక్ష్మీ నరసయ్య, ఎం.అబ్దుల్లా, ఆటో యూనియన్ నాయకులు బి.రాజు, కృష్ణ, యు.రమేష్, ఆది, మాల మహానాడు నాయకులు మాల నరసన్న మద్దతు తెలిపారు. అంగన్వాడీ నాయకులు శైలజ, నాగలక్ష్మి, తులసి, మేరీ, పద్మలత, గ్రేసమ్మ, నాగలక్ష్మి, నిర్మల, గౌసియా, సునీత, బండ లత, సుమిత్ర, అత్తర్ భాను, జయమ్మ, పార్వతి, సునీత, రాగమ్మ, శంషాద్ భాను పాల్గొన్నారు. **కోసిగి** మండల కమిటీ ఆధ్వర్యంలో భిక్షాటన చేపట్టారు. మార్కండేయ దేవాలయం నుంచి ప్రారంభించి తహశీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు లుసమ్మ, వరలక్ష్మి, యు.లక్ష్మి పద్మ, భాగ్యమ్మ, దేవి, సువర్ణ, సుజాత పాల్గొన్నారు. **మంత్రాలయంలో** అంగన్వాడీలు మోకాళ్లపై నిలబడి, చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన దీక్ష 8వ రోజుకు చేరుకుంది. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, ప్రాజెక్టు అధ్యక్షులు విశాలాక్షి, నాయకులు భీమేశ్వరి మాట్లాడారు. సిఐటియు నాయకులు ప్రాణేష్, అంజి, అంగన్వాడీలు ఉమామహేశ్వరి, ప్రమీల, హనుమంతమ్మ, ద్రాక్షాయణి, కళ్యాణి, రంగమ్మ, లక్ష్మి, మరియమ్మ, సుందరమ్మ, సరిత, మేరీ పాల్గొన్నారు. **ఆలూరులో** అంగన్వాడీ యూనియన్ నాయకులు వంటావార్పుతో నిరసన చేపట్టారు. అంగన్వాడీల సమ్మెకు సామాజిక కార్యకర్త మద్దతు తెలిపారు. తాలూకా కార్యదర్శి జయశ్రీ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, సిఐటియు తాలూకా నాయకులు కృష్ణ, అంగన్వాడీ నాయకులు భారతి, లీలావతమ్మ. సరోజమ్మ, బాలరంగమ్మ, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


ఆదోనిలో ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్వాడీలు


ఎమ్మిగనూరులో వంటావార్పు...


కోసిగిలో భిక్షాటన...


ఆలూరులో


మంత్రాలయంలో మోకాళ్లపై నిలబడి నిరసన

మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో

అందరి క్రిస్మస్ వేడుకలు

- 250 మంది వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేసిన మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలో క్రిస్టియన్ రిఫార్మ్ చర్చి ఆవరణలో 'అందరి క్రిస్మస్ వేడుకలు' నిర్వహించారు. మంగళవారం మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు 250 మందికి పైగా వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. సిఆర్‌సి చర్చి పాస్టర్ రవితేజ వాక్యోపదేశం చేశారు. మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు సతీమణి సిస్టర్ మల్లెల సునీల ఆలపించిన క్రైస్తవ మధుర గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా ఆదోని పట్టణ ముస్లిం, మైనార్టీ సామాజికవేత్త ఉమ్మి సలీం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.భారతమ్మ, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు బీసీ.నాగరాజు, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడారు. మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు కుల మతాలకు అతీతంగా చేస్తున్న సామాజిక సేవ అభినందనీయమని పేర్కొన్నారు. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు తన తల్లిదండ్రులు జీవరత్నం, సుశీలమ్మల స్ఫూర్తితో అణగారిన వర్గాలకు అండగా ఉంటున్నారని కొనియాడారు. సిఆర్‌సి సంఘ పెద్దలు దేవప్రసాద్, సాల్మన్, మల్లెల గ్రూప్స్ సభ్యులు మల్లెల సాల్మన్ రాజు, ఉలిద్ర సామేలు, ములుగుందం హనుమంతు, సతీష్, అజిత్, మత్తు పాల్గొన్నారు.


దుస్తులను పంపిణీ చేస్తున్న మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

అంగన్వాడీల సమస్యలను

సిఎం దృష్టికి తీసుకెళ్తాం

- ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంగన్వాడీల సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హామీఇచ్చారు. మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం'కు వచ్చిన వై.బాలనాగిరెడ్డికి వినతి పత్రం అందించి సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో కోరారు. దీనిపై స్పందించి బాలనాగిరెడ్డి మాట్లాడుతూ... మహిళలంటే ముఖ్యమంత్రికి ఎంతో గౌరవమని, మహిళల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలో వచ్చిన వెంటనే రూ.7 వేలు ఉన్న జీతాలను రూ.11,500లకు పెంచారని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చిన తర్వాత మాట తప్పరని తెలిపారు. 'ప్రభుత్వం మీ సమస్యల్లో కొన్నింటికి పరిష్కారం చూపుతుంది. మరికొన్ని ఎన్నికల అనంతరం పరిష్కరిస్తుంది. మీరు కూడా ప్రభుత్వానికి సహకరించాల'ని కోరారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి ఈరన్న, అంగన్వాడీ టీచర్స్ వెల్ఫేర్ సంఘం ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, ఖాసింబీ, రోజా, మేరీ, పుష్ప, దీప్తి, చాముండి పాల్గొన్నారు.

గద్దెరాళ్ల మారెమ్మ ఆలయ ట్రస్ట్ ఏర్పాటు

- రద్దు చేయాలని కోరుతున్న గద్దెరాళ్ల గ్రామస్తులు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో ప్రసిద్ధి చెందిన గద్దెరాళ్ల మారెమ్మ దేవాలయానికి ట్రస్ట్ కమిటీ ఏర్పాటుకు దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఆ నోటిఫికేషన్ రద్దు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. 2003 సంవత్సరం నుంచి దేవదాయ శాఖ పరిధిలో మారెమ్మ దేవాలయం విలీనం చేశారని తెలిపారు. అప్పటి నుంచి దేవాలయ ఆయకట్టుదారులు, పూజారులు, గ్రామస్తులు రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో రెండేళ్లకోసారి వచ్చే మారెమ్మ దేవర ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆలయ కమిటీ ఏర్పాటు చేయాలని నోటిఫికేషన్ జారీ చేయడం సబబు కాదన్నారు. దేవదాయ శాఖ జారీచేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. నోటిఫికేషన్ రద్దు చేయకపోతే గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో నేషనల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

ఒంగోల్‌లో గ్రూప్ 'బి' విభాగంలో జరిగిన బగవద్గీత రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదోని నేషనల్ స్కూలు విద్యార్థి కె.విమల్ ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారని జిఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత జి.గోపాల్ రెడ్డి, డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో వారు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. సహకారం అందించిన చిన్మయ మిషన్‌కు అభినందనలు తెలిపారు. విమల్ కుమార్‌కు ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని హానవాళ్ గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పేదలకు జగనన్న కాలనీలో 93 పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచి నారాయణప్ప, ఎంపిటిసి చాకలి ఈరన్న, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, గురునాథ్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు గోపాల రావుస్వామి పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై సిపిఎం వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

'గడపగడపకు' వచ్చిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి గ్రామ సమస్యలపై సిపిఎం మండల కమిటీ సభ్యులు బాషా, స్థానిక నాయకులు దస్తగిరి బాషా, రెహమాన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో సుమారు 1000 ఎకరాలకు పైగా ఉండే రైతుల ఆయకట్టు రస్తా సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరుకొని పిల్లలు బడికి రావాలంటే భయపడుతున్నారని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. లక్ష్మీపురం క్యాంపులో సిసి రోడ్లు, డ్రెయినేజీలు లేక ఎక్కడెక్కడ రోడ్డుపైనే నీళ్లు వెళ్లే పరిస్థితి ఉందని, వెంటనే సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు.

పైపు లైన్ మార్పు...

- బండ గట్టు నీటి సరఫరా బంద్

- ఇక్కట్లలో ప్రజలు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని నెల్లిబండ గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో ప్లాట్లు వేయడంతో ఆ పొలంలో వెళ్లిన బండగట్టు తాగునీటి పైపు లైన్ మార్పు నిర్మాణ పనులు మంగళవారం చేపట్టారు. దీంతో పలు గ్రామాలకు తాగునీటి సరఫరా బంద్ కానుంది. మండలంలోని దేవనకొండ, వరిముక్కల, అలారుదిన్నె, కరివేముల, కప్పట్రాళ్ల, గద్దెరాళ్ల, వెలమకూరు గ్రామాలకు తాగునీటి సరఫరాను సంబంధిత శాఖాధికారులు బంద్ చేయనున్నారు. నాలుగు రోజులపాటు ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పవు. పైపులైన్ మార్పు నిర్మాణ పనులు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే కిందిస్థాయి అధికారుల ప్రమేయంతోనే కొనసాగుతున్నాయన్న విమర్శలున్నాయి. సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత బండగట్టు తాగునీటి సరఫరా పర్యవేక్షణ అధికారి, పత్తికొండ సబ్ డివిజన్ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ విష్ణును వివరణ కోరగా... అధికారుల అనుమతితోనే పైపులైన్ మార్పునకు అయ్యే ఖర్చు పొలం యజమాని పెట్టుకున్నారని, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఆదేశాల మేరకు ఆ పనులు చేపట్టినట్లు తెలిపారు.


పైపులైన్ కోసం తవ్విన కాలువ

కనీస వేతనం అమలు చేయాలి

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి తులసి రామ్

ప్రజాశక్తి - ఆదోని

ఎపిఎస్‌ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసి రామ్, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని డిపో మేనేజర్ రఫీక్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిఒ మేరకు అన్‌స్కిల్డ్ వర్కర్స్‌కు రూ.11,356, సెమీ స్కిల్డ్ వర్కర్లకు రూ.13,415, స్కిల్డ్ వర్కర్లకు రూ.16,458, డేటా ఆపరేటర్లకు రూ.12,385 వేతనాలు అమలు చేయాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సర్కిల్ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. **ఎమ్మిగనూరు** ఆర్‌టిసి డిపో మేనేజర్ అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి వి.తులసి రామ్, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. జీతాల పెంపుతో పాటు గుర్తింపు కార్డులు, వారాంతపు సెలవులు, పండగ సెలవులు, కార్ డ్రైవర్లకు, కండక్టర్లకు బస్సు పాస్ ఇవ్వాలని కోరారు. మరణించిన కార్మికులకు వారసత్వాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు.


ఆదోని డిఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మాంత్రికిలో వైభవంగా కార్తీక ఉత్సవాలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


కుంభోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

మండలం లోని మాంత్రికి గ్రామంలో కార్తీక ఉత్సవాలు వైభవంగా సాగాయి. కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల నుంచి దేవాలయాన్ని వివిధ రకాల పూలతో, విద్యుద్దీపాలతో అలంకరించారు. శ్రీఈశ్వర స్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ప్రత్యేక భజనలు నిర్వహించారు. గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ఆకుపూజ, నందికోలు సేవ, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామ చివర కొండల్లో వెలసిన శ్రీసుంకులమ్మ అవ్వకు కుంభోత్సవం నిర్వహించారు. ఈ ఏడాది గ్రామంలో ప్రజలు అధిక సంఖ్యలో కుంభోత్సవాలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పెద్దతుంబలం ఎస్ఐ పీరయ్య, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సచివాలయాల్లో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - నందవరం

ముగతి-2, నందవరం-2 సచివాలయాలను ఎంపిడిఒ దశరథ రామయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాలకు ఆలస్యంగా వచ్చిన, హాజరు పట్టికలో సంతకం చేయని సచివాలయ సిబ్బందికి మెమో జారీ చేశారు. అలాగే కార్యాలయంలోని అన్ని రికార్డులనూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయ ఉద్యోగీ సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజలు మండల కేంద్రానికి వెళ్లకుండా సచివాలయంలో అన్ని సౌకర్యాలూ ప్రభుత్వం కల్పించిందని, అందుకు తగినట్లుగానే అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కొంతమంది సచివాలయ ఉద్యోగులు కార్యాలయాలకు సరిగ్గా రాకుండా సొంత పనులు చూసుకుంటూ, అప్పుడప్పుడు వస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుద్యోగ వయోపరిమితి పెంచాలి

- యువజన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిరుద్యోగులకు వయో పరిమితి 44 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీ ద్వారా 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. చాలా సంవత్సరాల నుంచి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగుల వయోపరిమితి మించిపోయి శాశ్వత నిరుద్యోగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువకులు ఉద్యోగాల భర్తీ కోసం అనేక రూపాల్లో ఆందోళన చేసిన ఫలితంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1, 2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. లేకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోక, సీనియర్ నాయకులు సాయినాథ్, సుంకన్న, మద్దిలేటి పాల్గొన్నారు.


అధికారికి వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో

'పది' మోడల్ పేపర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆదోని


మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన 10వ తరగతి మోడల్ పేపర్‌ను మంగళవారం ఆదోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డిఇఒ వెంకట రమణారెడ్డి, ఎంఇఒలు బి.శివరాములు, పి.శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.గాదిలింగప్ప మాట్లాడారు. 25 ఏళ్లుగా విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరతో పుస్తకాలను ముద్రిస్తున్నట్లు తెలిపారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదరించాలని కోరారు. వెనుకబడిన విద్యార్థులు కనీస మార్కులు సాధించడానికి ఈ మోడల్ పేపర్లు ఉపయోగపడతాయని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ జి.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున, వై.రామాంజనేయులు, యుటిఎఫ్ నాయకులు జగన్మోహన్‌రావు, మల్లికార్జున, శివకుమార్ గౌడ్, భోజరాజు, రాముడు, జనార్ధన్, రంగనాయకులు, నాగేష్, కృష్ణుడు, ఉరుకుందయ్య, వెంకటరమణ, హనుమంతు, జయప్రద పాల్గొన్నారు.

'యువగళం'తో ముఖ్యమంత్రికి భయం పట్టుకుంది

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి భయం పట్టుకుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'యువగళం పాదయాత్ర' విజయవంతం కావడంతో నిర్వహిస్తున్న 'యువగళం నవశకం' భారీ బహిరంగ సభకు కార్యకర్తలతో మంగళవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపికి ఆదరణ పెరిగిందని తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కా రెడ్డి నాయకత్వంలో టిడిపి శ్రేణులు సైనికులుగా యుద్ధానికి సిద్ధం కావాలని కోరారు. తమ సోదరులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు బయల్దేరి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. **ఆదోని** నుంచి 'యువగళం' ముగింపు సభకు బయల్దేరి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొంకా భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో ముగింపు సభకు తరలి వెళ్లారు. బుద్ధారెడ్డి, తిమ్మప్ప, లక్ష్మీనారాయణ, రవి పాటిల్, మల్లికార్జున్ రెడ్డి, బసాపురం రామస్వామి ఉన్నారు.


మంత్రాలయం నుంచి బహిరంగ సభకు వెళ్తున్న నాయకులు


ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

'సహజ వనరులను కాపాడుకుందాం'

ప్రజాశక్తి - ఆదోని

ప్రకృతి నుంచి లభించే సహజ వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ భవన్ నుంచి పోలీసు కంట్రోల్ రూమ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్, ఇంధనం, నీటిని పొదుపుగా వాడుకొని భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈనెల 14 నుంచి 20 వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్లు నాగభూషణం, సంతోష్, చెన్నయ్య, పులిగయ్య, ఉద్యోగులు హనుమంతు నాయక్, జయకుమార్, చంద్ర ఉన్నారు.





వన్యప్రాణుల వేటగాళ్ల వివరాలు వెల్లడిస్తున్న రేంజర్ నాసిర్‌జా

వంటావార్పుతో నిరసన

- 8వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- చాగలమర్రి, రుద్రవరంలో భిక్షాటన
- సున్నిపెంటలో రాస్తారోకో
- బనగానపల్లెలో ఎమ్మెల్యేకు వినతి అందజేత

ప్రజాశక్తి - విలేకరులు

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె జిల్లాలో ఎనిమిదో రోజు మంగళవారం వినూత్న రీతిలో కొనసాగింది. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, ఆళ్లగడ్డ, కొత్తపల్లి, బండి ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, బనగానపల్లె తదితర మండల కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట వంటా వార్పు చేపట్టి నిరసన తెలియజేశారు. బనగానపల్లెలో తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే సున్నిపెంటలో అంగన్‌వాడీలు రాస్తారోకో చేపట్టారు. చాగలమర్రి, రుద్రవరంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు.

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీలు వంట చేస్తూ తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా కార్యదర్శి బాల వెంకట్, తాలుకా కార్యదర్శి రమేష్ బాబు తదితరులు అంగన్వాడీలకు మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్రాల తాళాలు సచివాలయ సిబ్బందితో పగలగొట్టించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అంగన్వాడీల న్యాయమైన 14 డిమాండ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు రాజ్యలక్ష్మి, పెద్దక్క, వేణమ్మ, నరసమ్మ, భారతి, శశికళ, ముంతాజ్ తదితరులు మిగతా 6వ పేజీలో...



ఆళ్లగడ్డలో వంటావార్పు చేపడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

వన్యప్రాణి వేటగాళ్లు అరెస్ట్

- నాలుగు నాటు తుపాకులు, మందు గుండు సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

గుండ్లబ్రహ్మేశ్వరం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలోని నల్లమల అడవిలో ఐదుగురు వన్యప్రాణి వేటగాళ్లను అరెస్టు చేసినట్లు బండి ఆత్మకూరు రేంజర్ నాసిర్‌జా తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఆర్ కుంట, బాలయ్య కుంట పరిసరాల్లో సోమవారం వన్యప్రాణుల వేటగాళ్లు సంచరిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా అటవీ అధికారి వినీత్ కుమార్ ఆదేశాల మేరకు రేంజర్ నాసిర్‌జా, మొబైల్ పార్టీ డిఆర్‌ఒ నాగేంద్ర నాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది మెరుపు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మాచకొండ నాగరాజు అలియాస్ ఎరుకల చిన్న, బండ్లపల్లె చిరంజీవి అలియాస్ మున్నా, ఫకీర్ హుస్సేన్ ఆలం అలియాస్ సలాం, పటాన్ పెద్ద మౌలాలి, షేక్ హుస్సేన్ వల్లి అలియాస్ బోదకాలు హుస్సేన్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి నాలుగు నాటు తుపాకులు, మందు గుండు సామగ్రి, 2 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. వన్యప్రాణులను వేటాడినా, వాటికి నష్టం కలిగించిన కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా అనుమతి లేకుండా అడవుల్లోకి ప్రవేశించినా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాటు తుపాకులు స్వచ్ఛందంగా అప్పగించాలి : నల్లమల అడవి సమీప గ్రామాలైన కడమల కాలువ, సింగవరం, ఈర్ణపాడు, సోమయాజులపల్లి, జిసి పాలెం, జి.లింగాపురం, నారాయణపురం, చిన్నదేవలా పురం గ్రామాల్లోని ప్రజలతో పాటు నారపరెడ్డి కుంట, నెమ్మళ్లకుంట, మాయని చెరువు గూడెంలలో ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉంటే వారు స్వచ్ఛందంగా అటవీ శాఖ అధికారులకు అప్పగించాలని రేంజర్ నాసిర్‌జా తెలిపారు. అడవిలో వణ్యప్రాణులను వేటాడే వేటగాళ్లతోపాటు ఉచ్చులు వేసే వారు, అటవీ సంపదను అక్రమ రవాణా చేసేవారు, జంతువులకు హాని కలిగించే వారి సమాచారం తమ శాఖకు ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, వారికి తగిన రివార్డులు అందజేస్తామని తెలిపారు. పర్యావరణ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఫారెస్ట్ శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేసి అడవిని సంరక్షించాలని సూచించారు.



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు, మందు గుండు సామాగ్రి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

'ఆడుదాం-ఆంధ్ర'
టీమ్‌ల ఫార్మేషన్ పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి అన్ని మండలాలు, మున్సిపాలిటీలో టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలపై మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపిడిఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆడుదాం-ఆంధ్ర క్రీడా సంబరాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పోటీల నిర్వహణకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్వహించాలని ఆదేశించారు. పోటీలకు సంబంధించి అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీలు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకుని క్రీడా పోటీల ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, గ్రామ, వార్డు సచివాలయా లన్నింటికీ ఆడుదాం-ఆంధ్ర క్రీడా పరికరాలు సరఫరా చేశామని, 100 శాతం క్షేత్రస్థాయి ప్రాంతాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రీడా పోటీలకు సంబంధించిన క్రీడా పరికరాలు ఇంకా రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఆట స్థలాలను గుర్తించి రాళ్లు లేకుండా చదను చేసుకోవాలని చెప్పారు. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడా పోటీల నిర్వహణ ప్రదేశాల్లో షామియానా, ఆరోగ్య వైద్య శిబిరాలు, తాగునీటి వసతి, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ సుబ్బారెడ్డి, జిల్లా కీడాప్రాధికార అధికారి రాజు, డిపిఒ మంజులవాణి, డిఎల్‌డిఒ కళ్యాణి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జామకు పండు ఈగ వైరస్..

- ఆందోళనలో రైతులు - దెబ్బతిన్న కాయలను రహదారిపై పడేస్తున్న వైనం
- కొనేందుకు ముందుకు రాని వ్యాపారులు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలంలో రైతులు సాగు చేసిన జామ తోటలకు వైరస్ సోకింది. తెగుళ్ల బారిన పడిన జామ పంట దెబ్బతింటోంది. పండు ఈగ వల్ల కాయలు దెబ్బతినడంతో వాటిని తొలగించి రోడ్డుపై పడేస్తున్నారు. రైతులు నష్టాల బారిన పడుతున్నారు. చాగలమర్రికి చెందిన కౌలు రైతులు యాసిన్ మూడెకరాలు, ఉసేన్ బాషా రెండెకరాల్లో జామ పంటను సాగు చేశారు. ప్రస్తుతం జామ పంటకు పండు ఈగ పట్టడంతో కాయలు దెబ్బతింటున్నాయి. పండు ఈగ నుండి జామ కాయలను కాపాడుకునేందుకు ప్లాస్టిక్ కవర్లు తొడగినా ఫలితం లేదు. పండు ఈగ అధికం కావడంతో జామ కాయలకు రంధ్రాలు పడి దెబ్బతింటున్నాయి. దీంతో వ్యాపారులు కూడా కొనేందుకు ముందుకు రావడం లేదు. రైతులకు ఎకరాకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టారు. 25 కేజీల బాక్సు రూ.150 కూడా ధర పలకడం లేదని, దెబ్బతిన్న జామకాయలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నా మని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల ఖర్చు కూడా రాకపోవడంతో రహదారులపై పడేస్తున్న దుస్థితి నెలకొంది. సాధారణంగా 25 కేజీల బాక్సు రూ.500 ధర పలికేది. ప్రస్తుతం ధర భారీగా పడి పోయింది. పండు ఈగ వల్ల జామ కాయలకు రంధ్రాలు పడి ఎర్ర బారడడంతో దెబ్బతిన్న కాయలను తొలగిస్తున్నామని రైతులు చెబుతున్నారు. జామ తోటలు పెంచేందుకు ప్రభుత్వం రాయితీలు కూడా ఇవ్వడం లేదన్నారు. పండు ఈగ నివారణకు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యాన పంటలకు కల్పించే రాయితీలు ఇవ్వాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



శెట్టివీడు గ్రామంలో దెబ్బతిన్న జామకాయలను చూపిస్తున్న రైతు



దెబ్బతిన్న జామకాయలను రోడ్లపై పడేస్తున్న రైతు



మృతి చెందిన విద్యార్థిని సూర్య రాజేష్ గౌడ్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

- తల్లిదండ్రులకు గాయాలు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి సూర్యరాజేష్ గౌడ్(16) మృతి చెందగా, ఆ విద్యార్థి తల్లిదండ్రులకు గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తుమ్మలపెంట గ్రామానికి చెందిన సూర్య రామ్మూర్తి గౌడ్, రమ్మణమ్మలకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సూర్య రామ్మూర్తి గౌడ్ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కుమారుడు సూర్య రాజేష్ గౌడ్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రామ్మూర్తి తుమ్మలపెంటలోని జగనన్న కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఈ క్రమంలో రామ్మూర్తి గౌడ్, అతని భార్య రమణమ్మ, కుమారుడు సూర్య రాజేష్ గౌడ్‌లు కొత్త ఇంటి దగ్గరకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో వారి మోటార్ సైకిల్‌పై వస్తుండగా తుమ్మలపెంట వైపు నుండి తాడిపత్రి వైపునకు వెళ్లే ట్రాక్టర్ డ్రైవర్ ఢీ కొట్టాడు. రాజేష్‌పై ట్రాక్టర్ టైర్లు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులకు గాయాలయ్యాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : బిసి ఇందిర

ప్రజాశక్తి - బనగానపల్లె : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రిజిస్టర్ ఆఫీస్ ఏరియాలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని బిసి ఇందిరా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఎంతో ఉపయోగమని తెలిపారు. రాష్ట్ర, యువత భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరా

దళితులపై పెరిగిన దాడులు

- కెవిపిఎస్ జిల్లా నాయకులు పుల్లా నరసింహులు

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల పైన దాడులు పెరిగాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా నాయకులు పుల్లా నరసింహులు పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ఎమ్మెస్ నగర్‌లో క్యాండిల్ సెలబ్రేషన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి పీటర్ పాల్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పుల్లా నరసింహులు హాజరై మాట్లాడారు. కేంద్రంలో బిజెపి దళితులపైన, మైనార్టీలపైన దాడులు విపరీతంగా చేస్తుందని అన్నారు. బిజెపికి తొత్తులైన విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ లాంటి సంస్థలు దళితులపై, మైనార్టీలపై దాడులు చేయడమే వారి ఉద్దేశ్యంగా పెట్టుకున్నాయన్నారు. మణిపూర్ లాంటి రాష్ట్రాలలో ఇంకా దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. 2024లో బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే మనుధర్మ శాస్త్రాన్ని కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. కాబట్టి దళితులందరూ బిజెపిని వ్యతిరేకించాలన్నారు. రాష్ట్రంలో వైసిపి కూడా బిజెపి విధానాలను అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విషయంలో మోసం చేసిన బిజెపిని సపోర్ట్ చేయడం అన్యాయమన్నారు. రాష్ట్రానికి తలమానికంగా ఉన్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అమ్మివేయాలనుకోవడం దారుణ మన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌ను నిర్మిస్తామని ఇప్పుడు బిజెపి చేతులెత్తేసిం దన్నారు. వైజాగ్ పోర్టు, గన్నవరం పోర్టు రాష్ట్రంలో ఉన్న పోర్టులన్నింటినీ ఆదాని సంస్థకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ హెూదా గుర్తిస్తామన్న బిజెపి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రాష్ట్రానికి ఇంతటి ద్రోహం చేసిన బిజెపి భుజాన వేసుకొని వస్తున్న వైసిపిని కూడా దళితులందరూ ఏకమై వ్యతిరేకించాలని కోరారు. అనంతరం క్రిస్టియన్ జెఎసి తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి మన్యం జానయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఆర్ఒ జేమ్స్, రిటైర్డ్ ఎస్సై సామెల్, బ్రదర్ ఏసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు నరసింహ

విలేకరి కుటుంబాన్ని ఆదుకుంటాం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలం ఆంధ్రప్రభ విలేకరిగా పనిచేస్తున్న నాగరాజు కుటుంబాన్ని ఆదుకుంటామని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో నాగరాజు భార్య దుర్మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగరాజు కుటుంబానికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భోజనం మాజీ సర్పంచ్ తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు బి మల్లేశ్వర్ రెడ్డి, సర్పంచ్ ఎలగల రామచంద్రుడు, పెద్దదోలాపురం సర్పంచ్ పెద్దినేని పెద్దన్న, తెలుగుదేశం పార్టీ నాయకులు కంచర్ల చిన్న లింగారెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి డి సిద్దయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు నానుగొండ కృష్ణారెడ్డి, డిష్ రామలింగం, పాల శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా టైగర్ రిజర్వ్ ప్రాంతాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా నంద్యాల పరిధిలోని నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతాలను మార్చినట్లు ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ నంద్యాల అటవీ సంరక్షణ అధికారి బి.ఎన్.ఎన్.మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 జనవరి 1వ తేదీ నుండి ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాస్, ఇతర ప్లాస్టిక్ ఆధార వినియోగ వస్తువులను పూర్తిగా నిషేధించినట్లు వెల్లడించారు. పేపర్ బ్యాగ్స్, జూట్ బ్యాగ్స్ వినియోగించాలని కోరారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం అపరాధ రుసుం రూ.2 వేలు జరిమానా రశీదు ద్వారా విధించనున్నట్లు హెచ్చరించారు.

జనసేన పార్టీలో యువత చేరిక

ప్రజాశక్తి - నందికొట్కూరు : జూపాడుబంగ్లా మండలంలోని తూడిచెర్ల గ్రామానికి చెందిన 25 మంది యువకులు జనసేన పార్టీలో మంగళవారం చేరారు. వీరికి నందికొట్కూరు నియోజకవర్గం జనసేన–టిడిపి సమన్వయ బాధ్యులు నల్లమల రవికుమార్ పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఉల్లక్కి ప్రదీప్ కుమార్ అధ్యక్షతన బాలకృష్ణ, మహేష్ ఆధ్వర్యంలో జరిగిన జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మధు, రాజు, పుష్పరాజ్, స్వాములు, పారుమంచాల రాజు, తుడిచెర్ల పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను అధికారులు తనిఖీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గం ఉయ్యాలవాడ మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో ఉన్న రెండు అంగన్వాడీ కేంద్రాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. సిడిపిఒ తేజస్వరి, ఎంపీడీవో ఉమామహేశ్వర రావులు అంగన్వాడి సెంటర్ల ఇన్చార్జిలతో కలిసి సందర్శించి స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కుసుమకుమారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు క్రీడలు అవసరం'

ప్రజాశక్తి - బేతంచెర్ల : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని కర్నూలు జిల్లా అమ్మేచూర్ టైక్వాండో కార్యదర్శి మాస్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బేతంచెర్ల శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. త్వైక్వాండోలో ఎల్లో బెల్ట్, గ్రీన్ బెల్ట్ సాధించిన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలను ప్రదానం చేసి వారు అభినందించారు.

ఆరోగ్యకేంద్రానికి భోజనం సరఫరా చేయండి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ : సుండిపెంటలోని ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు దేవస్థానం అన్నదాన సత్రం భోజనం ఏర్పాటు చేయాలని ఇఒ పెద్ది రాజుకు కొమరం భీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వై.ఆశీర్వాదం, బిజెపి నాయకుడు చిక్కుడు చెట్టు వెంకటేశ్వర్లు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

పట్టుదల, క్రమశిక్షణతోనే విజయం

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టుదల, క్రమశిక్షణతోనే విజయం సాధించవచ్చని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కైప గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన విద్యా వారధి ఫౌండేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు 'మొదటి ర్యాకుకు 100 సూత్రాలు' అంశంపై యండమూరి వీరేంద్రనాథ్ రచించిన పుస్తకాలను పంపిణీ చేశారు. పలుకూరు తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు రాజు, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాణాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

పాడి రైతులు పశువుల దాణాను సద్వినియోగం చేసుకొని, పాల ఉత్పత్తి పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ గోవింద్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో బనగానపల్లె మండలానికి మంజూరయిన 20 టన్నుల టిఎంఆర్ దాణాను పాడి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు రైతులు పాడి పోషణలో రాణించాలన్నారు. ప్రస్తుతం పశువులకు వ్యాధులు సంక్రమించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. పశువులకు దాణా పెట్టడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందన్నారు. గొర్రెలు, మేకలు, పోట్టేళ్లకు దాణా అందించడం వల్ల మాంసకృతులు పెరుగుతాయని తెలిపారు. ప్రభుత్వం పశువులకు కూడా హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బనగానపల్లె పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మారుతి సకారామ్, కోయిలకుంట్ల పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కేవీ బ్రహ్మం, పశు వైద్యులు డాక్టర్ రాంకుమార్ రెడ్డి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఖురేష తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సిబ్బందికి ట్యాబ్‌లు అందజేత

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని మూడు పాఠశాలలకు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు ఎంఈఓ సుభాన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఆయా పాఠశాల సిబ్బందికి ట్యాబులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సుభాన్ మాట్లాడారు. ఈనెల 21న సిఎం పుట్టినరోజును పురస్కరించుకొని విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మురళీమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే ఆరోగ్యం : వైసిపి

ప్రజాశక్తి - బనగానపల్లె : మొక్కల పెంపకంతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే చెట్టు ఆరోగ్యాన్నిస్తుందని, చెట్లు ప్రగతికి సోపానమని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గౌరీ శంకర్, పిఈటి వెంకట రాముడు, జగదీశ్వర్ రెడ్డి, రాంబాబు, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి



గుడ్డలను అందజేస్తున్న సర్పంచ్ తులసమ్మ

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

స్థానిక మేజా గ్రామ పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ తులసమ్మ మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఈవో కె నాగమణి మాట్లాడుతూ క్రిస్మస్ పండగ సందర్భంగా గ్రామ పంచాయతీలో పనిచేసే ముగ్గురు పర్మినెంట్ కార్మికులు(మూడు జతలు) మరియు 33మంది టెంపరరీ కార్మికులకు (రెండు జతలు) గుడ్డలను అందజేశామ న్నారు. అలాగే అందరికీ చెప్పుల జతను కూడా అందజేశామన్నారు. అబ్దుల్లా పంచాయతీ సిబ్బంది రూబే, సుబ్బమ్మ, దేవదాస్, షే క్షావలి, ఓబులేష్, తిమ్మయ్యపాల్గొన్నారు.

డోన్‌లో శాశ్వతంగా నిలిచిపోయే అభివృద్ధి

ప్రాధాన్యత భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి బుగ్గన

ప్రజాశక్తి-డోన్

గత నాలుగున్నరేళ్లలో డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా చిరస్థాయిలో నిలిచి పోయే అభివృద్ధి జరిగిందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. సంక్రాంతి కల్లా డోన్ లోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం డోన్ మండలంలోని కన్నపకుంట నుంచి కమాలపురం వరకూ రూ.3 కోట్లతో నిర్మించిన రహదారిని ఆర్థిక మంత్రి బుగ్గన ప్రారంభించారు. అంతకుముందు కన్నపకుంటకు వచ్చిన మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. రహదారిని ప్రారంభించిన అనంతరం పాదయాత్రగా మంత్రి ప్రజలతో కలిసి కమలాపురం గ్రామం వరకూ వెళ్లారు. అక్కడ రైతుభరోసా కేంద్రాన్ని, సచివాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ కమాలపురం గ్రామంలో స్మశాన వాటికను ఏర్పాటు చేశామన్నారు. 2014 కంటే ఎక్కువ అభిమానం చూపి 2019లో తనను ప్రజలు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించడం వల్లే డోన్ అభివృద్ధి సాకారమైందన్నారు. డోన్‌లో కాపు భవన్, వడ్డెర భవనం, బేతంచెర్లలో వాల్మీకి భవనం నిర్మిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. టిడిపి చెబుతున్న బాబు ష్యూరిటీ -భవిష్యత్ గ్యారంటీకి నో వారంటీ అంటూ ఎద్దేవా చేశారు. టిడిపి అధికారంలో ఉండగా చేసిందేమీ లేదన్నారు. డోన్ నియోజకవర్గంలో పోటీ చేసేదెవరో టిడిపికే స్పష్టత లేదన్నారు. 'గెలిస్తే' అనే మెలికతో గెలిచినా ఆచరణ సాధ్యంకాని హామీలు టిడిపి నేతలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం గ్రామ సర్పంచ్ అర్జున్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి,రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.శ్రీరాములు,డోన్ ఎంపిపి రేగటి రాజశేఖర్ రెడ్డి,జెడ్పీటీసీ బద్దల రాజ్ కుమార్ యాదవ్,కన్నపకుంట సర్పంచ్ కల్యాణి, ఎంఆర్వో విద్యాసాగర్, పంచాయతి రాజ్ ఏఈ నారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శిలా ఫలకం ఆవిష్కరించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, జడ్పి ఛైర్మన్ తదితరులు

భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చాగలమర్రి



రైతులతో చర్చిస్తున్న ఆర్‌డిఒ

హైవే రహదారికి సంబంధించి నేషనల్ హైవే 440 జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు తగు పరిహారం అందించి న్యాయం చేస్తామని నంద్యాల ఆర్‌డిఒ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో హైవే రహదారి విస్తరణలో భూములు కోల్పో యిన రైతులతో విచారణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ హైవే 440 సంబంధించి చాగలమర్రి నుండి వేంపల్లి వరకు మండలంలోని చాగలమర్రికి చెందిన 23 మంది రైతులు సంబంధించి మూడు ఎకరాలు, మల్లె వేముల గ్రామానికి చెందిన 74 మంది రైతులకు సంబంధించిన 24 ఎకరాలు ఈ రహదారిలో రైతుల భూములు తీసుకుంటున్నామన్నారు. ఈ భూములకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం నష్ట పరిహారం రైతులకు అందజేయడం జరుగుతుం దన్నారు. అనంతరం రైతుల నుండి దస్తావేజులు, పట్టా పాసు పుస్తకాలు, ఈసీ, ఒన్ బి, అడంగల్, బ్యాంక్ అకౌంటు, ఆధార్ కార్డు, పాన్ కార్డుల నఖళ్ళను స్వీకరించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తాము సాగు చేసుకుంటున్నా భూములు విలువై నవని రోడ్డుకు తీసుకోవడం వల్ల భారీగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన భూములకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం కూడా మార్కెట్ విలువల ప్రకారం పరిహారం అందించాల్సిందిగా వారు ఆర్‌డిఓను కోరారు. తమకు గిట్టుబాటు ధర నిర్ణయిస్తేనే తమ భూములను ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తాసిల్దార్ విజయకుమార్,భూసేకరణ డిప్యూటీ తాసిల్దార్ మంజూరు హుస్సేన్, డిటి శ్రీనివాస్ రెడ్డి,మండల సర్వేయర్ మద్దిలేటి,వీఆర్వోలు సర్వేయర్లు,రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం : ఛైర్మన్

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని 32 వార్డులను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని 30,31 వార్డులో శ్రీరామ థియేటర్ ఎదురుగా ఉన్న సందులో నుంచి అంజనేయస్వామి టెంపుల్ రోడ్డు వరకు వేస్తున్న సీసీ రోడ్డుకు మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సప్తశైల రాజేష్ మాట్లాడుతూ 30, 31వ వార్డులకు గడపగడపకు మన ప్రభుత్వం,స్పెషల్ గ్రాంట్స్, సిఎండిఎఫ్ ద్వారా వచ్చినటువంటి రూ.60 లక్షల నిధులతో సిసి డ్రైన్లు,సీసీ రోడ్లు,సీసీ కల్వర్టులు వేయిస్తున్నామని తెలియజేశారు. అలాగే ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలోని 32 వార్డులకు 6 కోట్ల 40 లక్షల రూపాయలు స్పెషల్ గ్రాంట్స్ కింద మంజూరు చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డిఈ రసూల్,ఏఈ సురేష్,మున్సిపల్ వైస్ చైర్మెన్‌లు కొట్రికె హరికిషన్,ఎస్ఎండి జాకీర్ హుస్సేన్,వార్డు కౌన్సిలర్ ఆర్ట్.రమణ, నాయకులు పాలుట్ల రఘురామయ్య,వంశీ,కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

21 నుండి ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఈనెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవములు ప్రారంభం అవుతున్నట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి, ఛైర్మన్ సీతా రామ చంద్రుడు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి మహోత్సవాల సందర్భంగా ఆలయంలో విశేష పుష్పాలంకరణ అష్టవిధ మహా మంగళహారతి దేవస్థాన విద్వాంసులచే నాదస్వర కచేరి నిర్వహించి రాత్రి 9 గంటలకు జబర్దస్త్ టీం వారిచే సినీ ఆర్కెస్ట్రా నిర్వహిస్తామన్నారు. 22న వృషభరాజములకు బండలాగుడు పోటీలు, 23న న్యూ కేటగిరి విభాగ ములకు చెందిన వృషభ రాజములకు బండలాగుడు పోటీలు, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - బేతంచెర్ల



ఆర్థిక సహాయం అందిస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ కే బాషా తదితరులు

మండల కేంద్రం లోని భవన నిర్మాణ కార్మిక సంఘంలో సెంట్రింగ్ పనికి వెళ్లి వస్తుండగా బైక్ మీద నుండి కిందపడి తీవ్రంగా గాయపడిన కార్మికుడు అంజికి సిఐటియు నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన అంజికి మంగళవారం బేతంచెర్లలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్షు డు ఎస్ కే బాషా, ఎం రషీద్, ఎస్ రహిమాన్, డి వెంకటేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో రూ.22 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాసూమ్ వలి, డోన్ షేక్షా, దాదావాలి, శేషు, దాదా పీరా, వెంకటేశ్వర్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా



శిలా ఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో 194వ రోజు వార్డు కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, మహిళలు, రైతులకు సంక్షేమ పథకాలు అందాలంటే జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలను కోరారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పర్యటిస్తున్న సమయంలో ప్రజలందరూ వారి సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న తీరు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శశికళ రెడ్డి, రాష్ట్రదృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, నంద్యాల పట్టణ అధ్యక్షులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, పున్న శేషయ్య, జాకీర్ హుస్సేన్, పట్టణ సచివాలయాల కన్వీనర్ డాల్మిల్ అమీర్, వార్డు వైసిపి నాయకులు జయప్రకాష్, విజేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్ల వరకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నాం - ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో 20 సంవత్సరాల వరకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రవ్వలకొండ సమీపంలో 1 కోటి 53 లక్షల రూపాయలతో జల జీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఐదవ సచివాలయం పరిధిలోని రవ్వలకొండ అమ్మవారి శాల ఏరియా బ్రహ్మంగారిమఠం గొల్లపేట ఎస్టి కాలనీ నాయక్ వాడ మసీదు ఏరియాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలోని కొండ పేటలో చాలా కాలం నుంచి ఉన్న నీటి సమస్య తీరిందని తెలిపారు. అభివృద్ధికి టిడిపి నాయకులు అడుగ డుగునా అడ్డుపడుతున్నారని విమర్శించారు. ఎంపిడిఓ శివ, ఆర్డబ్ల్యూ ఎస్ డిఈ ఉమాకాంత్ రెడ్డి, ఏఈ సాయి, విద్యుత్ తేజ శ్రీనివాసులు, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, జడ్పిటిసి మెంబర్ లక్ష్మీ సుబ్బమ్మ, భాను ముక్కల సహకార సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు,వార్డు మెంబర్ లు జి టి వెంకటరామిరెడ్డి,సురేష్,ఎంపీటీసీ వెంకట వైసీపీ నాయకులు ఈసారి ఎల్లయ్య, కిషోర్ కుమార్, బాలు, గౌండ సుబ్బయ్య, గౌండ కంబగిరి, బిల్లా నాగరాజు యాదవ్ ముర్తుజా, గ్రామ సచివాలయం సిబ్బంది, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంఇఒ ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయులను అంగన్వాడీ సెంటర్‌లకు పంపడం సరికాదు

- యుటిఎఫ్ డోన్ మండల అధ్యక్షులు బివై సుబ్బరాయుడు

ప్రజాశక్తి-డోన్

ఉపాధ్యాయులను అంగన్వాడీ సెంటర్‌లకు పంపించడం సరికాదని యుటిఎఫ్ డోన్ మండల అధ్యక్షులు బివై సుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని ఎంఈఓ కార్యాలయ అవరణంలో ఎంఈఓ ప్రభాకర్‌కు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డోన్ మండల శాఖ తరపున వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బివై సుబ్బరాయుడు మాట్లాడుతూ డోన్ మండలం నందు అనేక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేయుస్తున్నారని, అందులో ఒకరిని అంగన్వాడీ సెంటర్‌కు పంపించడం వలన విద్యార్థులపై తీవ్ర ప్రభావము పడు తుందన్నారు. అలాగే ఒక ఉపాధ్యాయుడు అనారోగ్య రీత్యా సెలవు పెట్టుకోవడం కూడా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి గోపాల్, యుటిఎఫ్ నాయకులు సుమన్,శంషాద్ బేగం,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు సన్నద్ధం కావాలి : హెచ్‌ఎం

ప్రజాశక్తి - పగిడ్యాల

రాబోయే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థు లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నాయని కేవలం 90 రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. 2024 మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే పరీక్షలు సుల బతరంలో ఉత్తీర్ణత సాధించవచ్చున్నారు. ఇటువంటి ఒత్తిడికిలోను కాకుండా ప్రశాం తంగా చదివినప్పుడే మీరు చదివిన చదువు జ్ఞాపకం ఉంటుందన్నారు. క్రమశిక్షణలో కూడిన ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. భయము ఒత్తిడి లేకుండా ఏకాగ్రతతో చదివి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు సలహాలు ఇస్తున్న ఉపాధ్యాయులు

వంటావార్పుతో నిరసన

5వ పేజీ తరువాయి.. పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమ్మెలో భాగంగా వంటావార్పు చేపట్టి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వాల మాదిరిగానే ఈ ప్రభుత్వం మహిళల పట్ల చిన్నచూపు చూడడం తగదన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో వైసీపీ ప్రభుత్వానికి పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఒక వైపు చెప్తూనే మరో పక్క అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి సౌకర్యం కల్పించాలని, రాజకీయ, అధికారుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పి.వెంకట లింగం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ, ప్రాజెక్టు కార్యదర్శి సునీత, నాయకురాళ్లు నాగరాణి, ప్రసన్న, లలితమ్మ, అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు వంటావార్పు చేస్తూ నిరసనను వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా నాయకుడు పి దావీదు మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు సిఐటియు ఆధ్వర్యంలో వంట వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, డివిజన్ కార్యదర్శి జెవి.సుబ్బయ్యలు మాట్లాడారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రోజా రమణి, సెక్టార్ లీడర్లు రమాదేవి, వరలక్ష్మి, శశికళ, మల్లేశ్వరి, పర్వీన్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు **ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతి :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. **నందికొట్కూరు టౌన్:** నందికొట్కూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షతన అంగన్వాడీలు 8వ రోజు వంట వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు అంగన్వాడీల కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ తాళాలు సచివాలయ సిబ్బందితో పగలగొట్టించడం దుర్మార్గమైన అని మండిపడ్డారు. అంగన్వాడీ అక్కచెల్లెమ్మల ఓట్లతో గద్దెకెక్కిన ముఖ్యమంత్రి వారి సమస్యలు పరిష్కారం చేసే దశగా తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్‌పై రాజకీయ జోక్యం ఉండకూడదని, వారి న్యాయమైన 14 డిమాండ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రాజు, సిఐటియు నాయకులు నాగన్న, విఆర్ఏల సంఘం నాయకులు వాసు, టిడిపి నాయకులు షకీల్ అహ్మద్, అంగన్వాడీ వర్కర్స్ నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, హరిత, ఉమాదేవి, కీర్తి, కళావతి, సుబ్బమ్మ, కమల్ బి, రుక్మిణి, హుస్సేన్ బి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** అంగన్వాడీల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, అధ్యక్షులు రజాక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మిదేవి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం దగ్గర వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు ప్రమీలమ్మ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, రవణమ్మ, చెన్నమ్మ, అంగన్వాడీలు, ప్రజా సంఘాల నాయకులు నరసింహ నాయక్, గణపతి పాల్గొ న్నారు. **పగిడ్యాల :** తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడారు. అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వహించడం సరికాదన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్:** సుండిపెంటలో నిరాహార దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సెంటర్ నందు మానవహారం నిర్వహించి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణమ్మ, కాశమ్మలు వినతి పత్రం ఇచారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, ఎఐటియుసి నాయకులు ఓబులయ్య మాట్లాడారు. యూనియన్ నాయకులు బసవేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు:** మిడ్తూర్ మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శు, డి సుబ్బమ్మ, జి లక్ష్మి కుమారి అధ్యక్షతన అంగన్వాడీలు వంట వార్పుతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పి పక్కిరి సాహెబ్ మాట్లాడారు. సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, జి లింగస్వామి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీ నాగ మధు, డి శేషమ్మ, కే జి య రాణి, పుల్లమ్మ, మంగమ్మ, హుస్సేన్ అమ్మ, శైలజ, ఉమాదేవి, భువనేశ్వరి, తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు. **పాములపాడులో** అంగన్వాడీలు వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు హాజరై మాట్లాడారు. అనంతరం అంగన్వాడి టీచర్లు పాములపాడు పోలీస్ స్టేషన్లో తమ డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తుండగా అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టిన వారిపై కేసులు నమో దు చేయాలని ఫిర్యాదు చేశారు. అంగన్వాడీ వర్కర్స్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ ,నాగమణి,రవణమ్మ బాయ్, శ్రీలత పాల్గొన్నారు. **వెలుగోడు :** సిఐటియు ఆధ్వర్యంలో వంటావార్పు ద్వారా నిరసన తెలిపారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వి నాగమోహన్, అంగన్వాడి సెక్టార్ నాయకురాలు భాగ్యలక్ష్మి, అనిత, రవణమ్మలు మాట్లాడారు. **బండి ఆత్మకూర్ :** దీక్షా శిబిరం వద్ద వంటావార్పు నిర్వహించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు వసంత, ఆనందమ్మ, శ్యామల, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** స్థానిక తహశీల్దార్ ఆఫీస్ దగ్గర వంటావార్పు చేపట్టారు. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం హాజరై మాట్లాడారు. జిల్లా నాయకురాలు హరిత తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నాగరాజు



నందికొట్కూరు టౌన్ : వంట చేస్తున్న అంగన్వాడీలు

భిక్షాటనతో అంగన్వాడీలు నిరసన

రుద్రవరం : అంగన్వాడీల కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాయకురాలు మనోజ, బిబి, తిరుపాలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు రుద్రవరంలోని అమ్మవారి శాల నాలుగు రోడ్ల కూడలిలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదంటూ నినాదాలు చేస్తూ భిక్షాటన చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తూ.. చాగలమర్రి: సిఐటియు నాయకులు పద్మావతి, వసంత, నాగమణి, వై పద్మావతి, ఏఐటీయూసీ నాయకురాల ఆధ్వర్యంలో అంగన్వాడీలు దీక్ష శిబిరం నుంచి పురవీధులలో భిక్షాటన చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. **ప్రజాసంఘాల సంఘీభావం :** గత ఏడు రోజుల నుండి స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న నిరసన దీక్షలకు తెలుగుదేశం పార్టీ, బీసీ సంఘం, దూదేకుల సంఘం సంఘము సిఐటియు వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ అంగన్వాడి దీక్షలను సిఐటియు నాయకులు గుత్తి నర్సింహులు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు.



చాగలమర్రి: పురవీధులలో భిక్షాటన చేస్తున్న అంగన్వాడీలు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు



ఆత్మకూరు : వంటలు వడ్డిస్తున్నా అంగన్వాడీలు